సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం । 28 । మార్చి । 2023



వీరబ్రహ్మేంద్రస్వామి రథయాత్ర

బ్రహ్మంగారిమఠం మండలంలోని 56 గ్రామాల్లో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి రథయాత్ర నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా రథం తయారు చేయించారు. - 8లో



సమస్యల పరిష్కారానికి సాంకేతికత వినియోగం

దైనందిన సమస్యల పరిష్కారానికి సాంకేతికత వినియోగం ముఖ్యమైనదని వైవీయూ రిజిస్ట్రార్ వై.పి.వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.0 /25.8

జిల్లాలో సోమవారం 25.8 – 37.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ (సా॥)	సహర్ బుధ (ఉ॥)
కడప	6.30	4.58
ప్రొద్దుటూరు	6.29	4.57
పులివెందుల	6.33	5.03

చల చల్లగా..

- దూర ప్రాంతాలకు ఆర్టీసీ ఏసీ సర్వీసులు
- ప్రయాణికులకు అనువుగా బస్సుల వేళలు
- తక్కువ చార్జీలతో సౌకర్యవంతమైన ప్రయాణం



కడప కోటిరెడ్డిసర్కిల్ : 'ఆర్టీసీ బస్సులో ప్రయాణం సుఖవంతం.. సురక్షితం' అనే నినాదాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) సమర్థవంతంగా అమలు చేస్తోంది. వేసవిలో ప్రయాణికులకు ఆర్టీసీ బస్సు ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దింది. ప్రైవేట్ ట్రావెల్స్‌కు దీటుగా ఆర్టీసీ ప్రయాణికులకు సేవలు అందిస్తోంది. దూర ప్రాంతాలకు ఏసీ బస్సులను నడుపుతుతోంది. ప్రయాణికులు విజయవాడ, హైదరాబాద్, బెంగుళూరు, విశాఖపట్టణం తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రైవేట్ బస్సుల వైపు మొగ్గుచూపేవారు. అయితే ప్రస్తుతం ఆర్టీసీ కూడా ఆయా ప్రాంతాలకు ఏసీ బస్సులను నడుపుతుండటంతో వారి ఆలోచన మారుతోంది. ఆర్టీసీ ఏసీ బస్సుల్లో సైతం మినరల్ వాటర్ బాటిల్, బ్లాంకెట్ అందిస్తోంది. పైపెచ్చు ప్రైవేట్ ట్రావెల్స్‌తో పోలిస్తే ఆర్టీసీ బస్సుల్లో చార్జి కూడా తక్కువ. ఫలితంగా సురక్షిత ప్రయాణంతో పాటు సౌకర్యవంతమైన సదుపాయాలతో ఆర్టీసీ ప్రయాణికులను ఆకర్షిస్తోంది.

ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి



వేసవిని దృష్టిలో పెట్టుకుని ఏపీఎస్ఆర్టీసీ దూర ప్రాంతాలకు ఏసీ బస్సులను నడుపుతోంది. తక్కువ చార్జీలతో సురక్షిత, సౌకర్యవంతమైన ప్రయాణం సాగేలా ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి, కడప

జిల్లాలోని ఏసీ బస్సుల వివరాలు

డిపో పేరు	బయలుదేరు సమయం	బయలుదేరు ప్రాంతం(సర్వీసు)	గమ్యస్థానం	చార్జీ (రూ.లలో)
కడప	ఉ'' 10.30	కడప (ఇంద్ర)	బెంగుళూరు	654
	మ'' 12.14	కడప (ఇంద్ర)	బెంగుళూరు	654
	మ'' 1.30	కడప (అమరావతి)	బెంగుళూరు	797
	మ'' 3.00	కడప (అమరావతి)	బెంగుళూరు	797
	రా'' 10.00	కడప (ఇంద్ర)	బెంగుళూరు	654
	రా'' 11.00	కడప (ఇంద్ర)	బెంగుళూరు	654
	రా'' 11.15	కడప (అమరావతి)	బెంగుళూరు	797
	రా'' 11.45	కడప (అమరావతి)	బెంగుళూరు	797
కడప	రా'' 9.30	కడప (ఇంద్ర)	హైదరాబాద్	
.			ఎంజీబీఎస్	1010
.			బీహెచ్ఈఎల్	1042
ప్రొద్దుటూరు	మ'' 2.00	ప్రొద్దుటూరు (ఇంద్ర)	బెంగుళూరు	722
	సా'' 7.30	ప్రొద్దుటూరు (ఇంద్ర)	బెంగుళూరు	722
పులివెందుల	రా'' 8.30,	పులివెందుల(ఇంద్ర)	హైదరాబాద్	
.			ఎంజీబీఎస్	1112
.	రా''10.30		బీహెచ్ఈఎల్	1392

వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట



104 వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

- ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమం దేశానికే ఆదర్శం
- ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద పీట వేసినట్లు ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా పేర్కొన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో 104 వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన ఆరోగ్యశ్రీ పథకానికి వైఎస్ జగన్ అనేక మెరుగులు దిద్ది పేదలకు చేరువ చేశారన్నారు. గతంలో ఆరోగ్యశ్రీలో 1004 వ్యాధులకు మాత్రమే చికిత్స ఉండేదని, ప్రస్తుతం 3400 పైచిలుకు వ్యాధులను చేర్చినట్లు చెప్పారు. వెయ్యి రూపాయలు దాటిన ప్రతి చికిత్సను ఆరోగ్యశ్రీ పథకం కిందకు తీసుకొచ్చారన్నారు. పేదలు ఆపరేషన్ చేయించుకున్న తర్వాత పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించే పరిస్థితి ఉండదని గ్రహించి, డాక్టర్ సూచించిన మేరకు విశ్రాంతి తీసుకునే సమయంలో నెలకు రూ.5వేల ఆర్థిక సాయం కూడా చేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తీసుకొచ్చారని, ఇది దేశానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. ప్రతి మండలానికి రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసి, అందులో ఇద్దరు డాక్టర్లను నియమిస్తారన్నారు. ఇద్దరు డాక్టర్లలో ఒకరు 104 వాహనంలో క్షేత్రస్థాయిలో అన్ని మండలాలకు వెళ్లి వైద్యం అందిస్తారని, మరో డాక్టర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉంటారన్నారు. 104 వాహనంలో 64 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. జిల్లాలో ఇప్పటికే 36 వాహనాలు ఉన్నాయని, మరో 3 కొత్త వాహనాలను కేటాయించారన్నారు. కడప మండలానికి ఒక వాహనం ఉందని, పెద్ద మండలం అయినందున మరో వాహనం కూడా ఇచ్చారన్నారు. కడపలో 9 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఒక్కొక్కటి రూ.85లక్షలతో నిర్మించడం జరిగిందన్నారు. ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డా. కె. నాగరాజు, అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓ డా. ఉమామహేశ్వరరావు, 104 వాహనాల జిల్లా మేనేజర్ వెంకట సుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య, ఎస్. సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ, అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ యూత్ వలంటీర్స్‌కు దరఖాస్తులు

వైవీయూ : భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువకేంద్రం పరిధిలో నేషనల్ యూత్ వలంటీర్‌గా పనిచేసేందుకు ఆసక్తి గల యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువకేంద్రం కో–ఆర్డినేటర్ కె. మణికంఠం కోరారు. దరఖాస్తులను ఏప్రిల్ 3వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని సూచించారు. పదోతరగతి పాసై, 18 నుంచి 29 సంవత్సరాలలోపు వయసు కలిగిన వారు అర్హులన్నారు. ఉద్యోగం చేస్తున్నవారు, చదువుతున్న వారు ఇందుకు అనర్హులు అన్నారు. ఇది కేవలం స్వచ్ఛంద సేవమాత్రమే, ఉద్యోగం కాదని పేర్కొన్నారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు చెందిన వారు ఎన్‌వైకేఎస్.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికలు ఇంటర్వ్యూ ఆధారంగా నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు కడప నగరం బాలాజీనగర్‌లోని యూత్‌హాస్టల్‌లో, 08562–356303, 95330 44233 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

న్యూస్‌రీల్

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి



వృద్ధుడితో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలనీ జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన'కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన'ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప సిటీ : జిల్లాలోని ఆయా గ్రామ, మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న గ్రామ, వార్డు వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం162 పోస్టులు ఖాళీలున్నట్లు తెలిపారు. సోమవారం నోటిఫికేషన్ వెలువడిందన్నారు. ఈ నెల 28,29 తేదీల్లో దరఖాస్తుల స్వీకరణ, 31 న పరిశీలన, ఏప్రిల్ 1,2 తేదీల్లో ఎంపిక, 3న ఎంపిక జాబితా విడుదల, 4న వలంటీర్‌గా నియామకం చేపట్టనున్నట్లు చెప్పారు.

రామయ్య హుండీ ఆదాయం రూ. 6.59 లక్షలు

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయానికి సంబంధించి మార్చి నెల హుండీ ఆదాయం రూ. 6 లక్షల, 59 వేల, 238 వచ్చింది. ఈ విషయాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనుంజయుడు తెలిపారు. ఈ సోమవారం ఆలయ రంగమండపంలో స్వామి వారి హుండీ ఆదాయాన్ని టీటీడీ సిబ్బంది లెక్కించారు.

రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి

కడప అగ్రికల్చర్ : ఖరీఫ్ 2022 సంవత్సరంలో పసుపు సాగు చేసిన రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రం(ఆర్‌బీకే)లో పేర్లు నమోదు చేసుకోవాలని మార్కెఫెడ్ జిల్లా అధికారి నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ -2022 సంవత్సరంలో పసుపు సాగు చేసిన ప్రతి రైతు ఈ క్రాపులో పంట నమోదు చేసుకుని, ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని చెప్పారు. నమోదు చేసుకున్న వారికి సీఎం యాప్ ద్వారా కొనుగోలు షెడ్యూల్ ఇవ్వనున్నట్లు తెలిపారు. వీరి ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తారన్నారు. జిల్లాలో 4122 మంది రైతులు 4783.5 ఎకరాల్లో పసుపుపంటను సాగు చేశారని వివరించారు.

31న జాతీయ మీడియా సలహాదారు జిల్లాకు రాక

కడప సిటీ : జాతీయ మీడియా సలహాదారులు దేవులపల్లి అమర్ ఈ నెల 31 వతేదీ శుక్రవారం జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ విజయరామరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన 30 వ తేదీ రాత్రి హైదరాబాద్ నుంచి రైలులో బయలుదేరి 31 వతేదీన ఉదయం కడపకు చేరుకుంటారన్నారు. మధ్యాహ్నం 1 గంటకు కడప వైఎస్ఆర్ ప్రెస్ క్లబ్ జరిగే స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు. అనంతరం రాత్రి 9 గంటలకు రైలులో హైదరాబాద్ వెళ్లనున్నారని తెలిపారు.

ఎస్సెస్సీ బోర్డు వెబ్‌సైట్‌లో హాల్‌టిక్కెట్లు

కడప ఎడ్యుకేషన్ : ఎస్సెస్సీ–2023 పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను విద్యార్థులు నేరుగా ఎస్సెస్సీ బోర్డు వెబ్‌సైట్ బీఎస్ఈ.ఏపీ.జీవోవి.ఇన్ నుంచి డౌన్ లోడ్ చేసుకుని పరీక్షకు హాజరుకావచ్చని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. హాల్ టికెట్లపైన ప్రధానోపాధ్యాయుడి సంతకం, పాఠశాల సీలు అవసరం లేదని అన్నారు. కావున పదోతరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని డీఈఓ కోరారు.

అన్నమయ్య జయంతి ఉత్సవాలపై ప్రత్యేక శ్రద్ధ

- అన్నమయ్య పేరుతో జిల్లా ఆవిర్భావం తర్వాత తొలి జయంతి ఉత్సవాలు
- వైభవంగా నిర్వహణకు టీటీడీ, జిల్లా యంత్రాంగం సన్నద్ధం
- మే 6 నుంచి 12 వరకు నిర్వహణ
- రాజంపేట ఎమ్మెల్యే మేడాతో జిల్లాపర్యాటక అధికారుల బృందం భేటీ



ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డితో మాట్లాడుతున్న రమణప్రసాద్, నాగభూషణం

రాజంపేట : పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 615వ జయంతి ఉత్సవాలపై జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ప్రత్యేక శ్రద్ధ వహించనున్నారు. అన్నమయ్య పేరుతో జిల్లా ఏర్పడిన తర్వాత తొలిసారిగా నిర్వహిస్తున్న జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఉత్సవాలను తిరుమల తిరుపతి దేవస్థానం, జిల్లా యంత్రాంగం కలిసి కట్టుగా నిర్వహించేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాజంపేటలోని మేడా భవన్‌లో శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డితో జిల్లా పర్యాటకశాఖ ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ రమణప్రసాద్, జిల్లా పర్యాటకశాఖాధికారి ఎం.నాగభూషణం భేటీ అయ్యారు. మే 6 నుంచి 12వరకు జయంతి ఉత్సవాలను టీటీడీ సహకారంతో వైభవోపేతంగా నిర్వహించాలని నిర్ణయించారు.

అన్నమయ్య విగ్రహం వద్ద..

అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం(అన్నమయ్య థీంపార్కు) వద్ద జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నారు. పర్యాటకశాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ రమణప్రసాద్ విలేకర్లతో మాట్లాడుతూ ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోందన్నారు. ఉదయం 9గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఉత్సవాలను నిర్వహించాల్సి ఉందన్నారు. అన్నమయ్య సంకీర్తనలు, గోష్ఠి గానం, నాదస్వర సమ్మేళనం, శ్రీవారి కల్యాణం, కూచిపూడి, భరతనాట్యం, సాహిత సదస్సులు, వ్యాసరచన పోటీలు తదితర సంప్రదాయ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సానుకూలంగా స్పందించారన్నారు.

సేవలతో మెరిసి..పురస్కారంతో మురిసి

- జిల్లా ఆస్పత్రికి రెండోసారి ఎన్‌క్వాస్ అవార్డు
- ప్రైజ్‌మనీ కింద రూ. 41 లక్షలు అందచేయనున్న ప్రభుత్వం



ప్రొద్దుటూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రి మరోమారు 2023–26 సంవత్సరానికి గాను ఎన్‌క్వాస్ (నేషనల్ క్వాలిటీ అసూరెన్స్ స్టాండర్డ్స్) అవార్డుకు ఎంపికైంది. జాతీయ నాణ్యతా హామీ ప్రమాణాల్లో భాగంగా అవార్డుకు ఎంపికైన ఆస్పత్రికి రూ. 41 లక్షలు కేంద్ర ప్రభుత్వం అందచేయనుంది. గతంలోనూ 2018–21 సంవత్సరానికి గాను జిల్లా ఆస్పత్రి ఎన్‌క్వాస్ అవార్డుకు ఎంపికైన విషయం తెలిసిందే. ప్రొద్దుటూరు ఆస్పత్రి కేంద్ర ప్రభుత్వ ఎన్‌క్వాస్ అవార్డుకు ఎంపికై నట్లు సోమవారం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ నుంచి జిల్లా ఆస్పత్రి అధికారులకు సమాచారం అందింది. ఈ ఏడాది మార్చి 19న మూడు రోజుల పాటు గుజరాత్, తమిళనాడు, కేరళ నుంచి అధికారుల బృందం ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఆస్పత్రి సేవలపై ఆ నాడే సంతృప్తి వ్యక్తం చేశారు.

అన్ని విభాగాల్లోనూ మెరుగైన పర్సెంటేజ్

కేంద్ర ప్రభుత్వ అధికారులు పరిశీలనలో అన్ని విభాగాల్లోనూ మెరుగైన ఫలితాలు వచ్చాయి. క్యాజువాలిటికి 98 శాతం, ఓపీకి 96, మెటర్నిటీ వార్డుకు 96, చిన్న పిల్లల వార్డుకు 93, ఎస్ఎన్‌సీయూకు 97, ఆపరేషన్ థియేటర్‌కు 91, పీపీ యూనిట్‌కు 96, ఐపీ వార్డులకు 92, బ్లడ్ బ్యాంక్‌కు 87, ల్యాబ్‌కు 86, రేడియాలజీకి 95, ఫార్మసీ విభాగానికి 98, పరిపాలన విభాగానికి 96, మార్చురీకి 84 శాతం మార్కులు లభించాయి. ఒకటి, రెండు మినహా అన్ని విభాగాల్లోనూ 90కి పైగా మార్కులు రావడంతో అధికారులు ఎన్‌క్వాస్ అవార్డుకు ఎంపిక చేశారు.

అవార్డు కింద రూ. 41 లక్షలు ప్రైజ్‌మనీ

జిల్లా ఆస్పత్రికి అవార్డు కింద రూ. 41 లక్షలు ప్రైజ్ మనీ అందచేస్తారని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు తెలిపారు. ఆస్పత్రిలో 350 పడకలు ఉండగా ప్రతి పడకకు అవార్డులో భాగంగా రూ. 10 వేలు ఇస్తారన్నారు. మరో రూ. 6 లక్షలు అదనంగా ఇస్తారని పేర్కొన్నారు. ఇందులో ప్రోత్సాహక బహుమతి కింద 25 శాతం మొత్తాన్ని ఆస్పత్రిలోని వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బందికి అందచేస్తారని తెలిపారు. 75 శాతం నిధులు ఆస్పత్రి అభివృద్ధికి వాడుకుంటామని చెప్పారు. అది కూడా కలెక్టర్ అనుమతి మేరకు ఖర్చు చేయల్సి వస్తుందని సూపరింటెండెంట్ తెలిపారు.

కోవిడ్ తర్వాత మెరుగుపడిన వైద్య సేవలు

కోవిడ్ అనంతరం ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు పూర్తిగా మెరుగుపడ్డాయి. ఆస్పత్రిలో ప్రతి రోజు ఓపీ సుమారు 1400 వరకు ఉంటుంది. అలాగే ఐపీ 320, ఎమ్మార్‌ఐ స్కానింగ్ నెలకు 1200, సీటీ స్కానింగ్ 1600, ఎక్స్‌రే 2700, రక్తపరీక్షలు సుమారు 50 వేలు, అల్ట్రాసౌండ్ 2 వేలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు 90, ప్రసవాలు 150, మేజర్ సర్జరీలు 250 నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి అధికారులు తెలిపారు.

సమష్టి కృషితో ఎన్‌క్వాస్ అవార్డు



ఆస్పత్రిలోని వైద్యులు, నర్సింగ్ సిబ్బందితో పాటు అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమష్టి కృషితోనే ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి ఎన్‌క్వాస్ అవార్డు వరించింది. రానున్న రోజుల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందిస్తాం. క్యాష్ అవార్డుతో ఆస్పత్రిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తాం.

– డాక్టర్ ఆనంద్‌బాబు, మెడికల్ సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి, ప్రొద్దుటూరు

అర్జీలకు త్వరితగతిన పరిష్కారం



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కడప సిటీ : స్పందనలో వచ్చిన అర్జీలకు వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ విజయరామరాజు అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్వో గంగాధర్ గౌడ్, డ్వామా పీడీ యదుభూషణ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామమోహన్, నరసింహులు, హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు కార్యక్రమంలో సీపీఓ వెంకట్రావు, హౌసింగ్ పీడీ కృష్ణయ్య పాల్గొన్నారు.

- జిల్లాలో జరుగుతున్న గృహ నిర్మాణ పనులను వేగవంతం చేసి పురోగతి సాధించాలని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవన్‌లో నగర కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్వో గంగాధర్ గౌడ్, హౌసింగ్ పీడీ కృష్ణయ్యతో కలిసి జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతి, మౌలిక వసతులు, జగనన్న సంపూర్ణ గృహ హక్కు, అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, పురోగతి తదితర అంశాలపై హౌసింగ్, ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందాలన్నారు. లక్ష్య సాధన కోసం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలోఆర్డీఓలు ధర్మచంద్రారెడ్డి, వెంకటరమణ, శ్రీనువాసులు, వెంకటేష్, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు హౌసింగ్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.
- ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య హక్కు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల కుటుంబాల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య హక్కు అమలుకు సంబంధించి ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా విద్యాశాఖ అధికారులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 121 ప్రకారం 25 శాతం సీట్లు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లల కోసం ప్రైవేట్ స్కూళ్లలో రిజర్వ్ చేశారన్నారు.మార్చి 22,2023 నుంచి ఏప్రిల్ 10 2023 వరకు 5 నుంచి 6 సంవత్సరాల వయస్సు ఉన్న విద్యార్థులకు ఒకటవ తరగతిలో ఉచితంగా ప్రవేశం కల్పించనున్నట్లు చెప్పారు. దరఖాస్తు సమర్పించడానికి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్‌సీ.ఏపీ.జీఓవి.ఇన్‌అనే వెబ్ సైట్‌ను సందర్శించాలని లేదా వార్డు, గ్రామ సచివాలయంలో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డీఈఓ రాఘవరెడ్డి, సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి,సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ నేత్రదానంతో ఇద్దరికి చూపు

పులివెందుల రూరల్ : మహిళ నేత్రదానం చేయడంతో ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించిందని నేత్రనిధి అధ్యక్షుడు రాజు పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దరంగాపురానికి చెందిన గంగమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరిస్తూ నేత్రనిధి అధ్యక్షుడు రాజుకు సమాచారం అందించారు. దీంతో రాజు సిబ్బందితో కలిసి మృతురాలి స్వగృహానికి వెళ్లి గంగమ్మ మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్ అగర్వాల్ నేత్రనిధికి పంపించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నేత్రాలు దానం చేయడంవల్ల అంధత్వంతో బాధపడుతున్న వారికి చూపును ప్రసాదించినవారవుతారని పేర్కొన్నారు.



మృతురాలి కుటుంబ సభ్యులనుంచి కార్నియాలను సేకరిస్తున్న నేత్రనిధి సిబ్బంది

అచ్చెన్న మృతిపై సమగ్ర విచారణ జరపాలి



అన్నమయ్య జిల్లా ఎస్పీతో మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ

రామాపురం/రాయచోటి అర్బన్ : వైఎస్సార్ జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ అచ్చెన్న మృతిపై సమగ్ర విచారణ జరపాలని పలువురు డిమాండ్ చేశారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ రామాపురం మండలంలోని గువ్వలచెరువు ఘాట్ ప్రాంతంలో అచ్చెన్న మృతదేహం లభించిన ప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు. అనంతరం సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గసభ్యుడు జి.ఈశ్వరయ్యతో కలిసి రాయచోటిలోని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజును ఆయన కార్యాలయంలో కలిశారు. హంతకులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. హత్యకు పరోక్షంగా సహకరించిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ రాష్ట్రనేతలు నరేంద్ర మాదిగ, రామాంజనేయులు, శివయ్య, అన్నమయ్య జిల్లా ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు బండకింద మనోహర్, కడప జిల్లా కన్వీనర్ వెంకటేష్, ఎంఆర్‌పీఎస్ నేతలు ఆండన్, మహదేవ, నాగేంద్ర, నరసింహులు, రామా ంజులు, ఎంఈఎఫ్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు మాట్లాడుతూ అచ్చెన్న మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విష్ణుప్రీతం రెడ్డి, శ్యామలాదేవి, మామిళ్ళ బాబు, ఆనంద్, సూర్యుడు తదితరులు పాల్గొన్నారు.

కడప కోటిరెడ్డి సర్కిల్: రాయలసీమ ప్రజా సంఘాల జేఏసీ నాయకులు వి.రమణ, అవ్వారు మల్లికార్జున, సంగటి మనోహర్ జిల్లా కలెక్టర్ విజయ్ రామరాజును కలిసి వినతి పత్రం సమర్పించారు.

విషాదకరం

కడప అగ్రికల్చర్ : కడప బహుళార్థ పశు వైద్యశాల డిప్యూటీ డైరెక్టర్ అచ్చెన్న మృతి విషాదకరం అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ అమరేంద్ర అన్నారు. సోమవారం సాయంత్రం కడప వీసీపీని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శారదమ్మతో కలిసి సందర్శించి అచ్చెన్న మృతికి తమ సంతాపాన్ని తెలిపి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడ జరుగుతున్న పరిణామాలపై వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ, కడప డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమణయ్య, ఐఎస్‌డీపీ ఏడీ డాక్టర్ రమణారెడ్డి, డాక్టర్ ప్రమోద్, డాక్టర్ శివరామిరెడ్డి, ఏపీవీఏఎస్ఎస్ఏ ప్రెసిడెంట్ డాక్టర్ నేతాజీ, సెక్రటరీ రాజశేఖర్, ఏపీఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు త్రిసభ్య కమిటీ రాక

ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం కడపలోని బహుళార్థ పశువైద్యశాలకు(వీసీపీ) పశుసంవర్ధకశాఖ అడిషినల్ డైరెక్టర్‌తో కలిసి త్రిసభ్య కమిటీ వస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ తెలిపారు. ఈ కమిటీ ఇక్కడ పరిస్థితులపై ఆరా తీయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

క్లుప్తంగా

యువకుడిపై దాడి


గాయపడిన భాస్కర్

బద్వేలు అర్బన్ : స్థానిక శివాలయం రోడ్డులోని రాధాకృష్ణ కల్యాణ మండపం ఆవరణలో సోమవారం బొల్లు భాస్కర్ అనే యువకుడిపై దాడి జరిగింది. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక రాధాకృష్ణ కల్యాణ మండపం సమీపంలో నివసించే బొల్లు భాస్కర్ అనే యువకుడు ఓ న్యాయవాది వద్ద గుమస్తాగా పని చేస్తుండటంతోపాటు లా చదువుతున్నాడు. ఇతని కుటుంబ సభ్యులకు కర్నూలుకు చెందిన బొజ్జా వెంకటరమణ మధ్య ఓ ఆస్తి విషయమై వివాదం నడుస్తోంది. అయితే సోమవారం బొజ్జా వెంకటరమణ అనే వ్యక్తి కొంత మంది తన అనుచరులతో వచ్చి కల్యాణ మండపంలో సంచరిస్తుండగా.. ఇక్కడికి ఎందుకు వచ్చారని భాస్కర్ ప్రశ్నించగా నీవెవరు మమ్మల్ని అడిగేందుకు అని దాడికి యత్నించారు. ఈ ఘటనలో భాస్కర్ తలకు గాయం కావడంతో అక్కడి నుంచి పారిపోయి ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు వెళ్లి బాధితుని వాంగ్మూలం నమోదు చేశారు. ఫిర్యాదుపై అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రిమ్స్‌లో రెండు గుర్తుతెలియని మృతదేహాలు




కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్)లో వైద్య సేవలకు వచ్చిన ఇద్దరిలో ఈ నెల 25న ఒకరు, 26న మరొకరు మృతి చెందారు. వీరి ఆచూకీ తెలియకపోవడంతో మృతదేహాలను రిమ్స్ మార్చురీలో వుంచారు. వారి ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా వుంటే తమను సంప్రదించాలని కడప రిమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు తెలియజేశారు.

హత్య కాదు.. ప్రమాదం

- ట్రాక్టర్ ఎక్కడంతోనే మృతి చెందిన రాము
- విచారణలో నిర్ధారించిన రూరల్ పోలీసులు
- ముగ్గురు నిందితులు అరెస్ట్, ట్రాక్టర్ స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ యుగంధర్, ఎస్ఐ సంజీవరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని అమృతానగర్‌లో మృతి చెందిన కురువ రాముది హత్య కాదని, ట్రాక్టర్ ప్రమాదంలో అతను మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు. సంఘటనా స్థలంలో మృతదేహం పడి ఉన్న స్థితిని చూసి రామును గుర్తు తెలియని వ్యక్తి హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తూ కేసు నమోదు చేశారు. అయితే దర్యాప్తులో భాగంగా.. పడుకున్న రాముపై ట్రాక్టర్ వెళ్లడంతో అతను మృతి చెందినట్లు కేసు నమోదు చేయడంతోపాటు ఇందుకు బాధ్యులైన ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఇన్‌చార్జి సీఐ యుగంధర్, రూరల్ ఎస్ఐ సంజీవరెడ్డి సోమవారం సాయంత్రం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అరెస్ట్ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈ నెల 23న అమృతానగర్‌లోని 18వ వీధిలో రాము మృతదేహం రక్తపు మడుగులో పడి ఉంది. ఈ మేరకు అదే రోజు అతని భార్య జ్యోతి ఫిర్యాదు చేయడంతో రూరల్ పోలీసులు హత్యకేసుగా నమోదు చేశారు. అయితే దీనిపై దర్యాప్తు చేసిన పోలీసులు రాము మృతదేహంపై ఉన్న గాయాల ప్రకారం ఇది హత్య కాదని ప్రాథమికంగా నిర్ధారించారు. సంఘటనా స్థలంలో వాహన చక్రాల జాడల ఆధారంగా ట్రాక్టర్ ప్రమాదంలో రాము మృతి చెంది ఉంటాడని పోలీసులకు నిర్ధారణకు వచ్చారు. ఆ ప్రాంతంలోని కొందరు వ్యక్తులను విచారణ చేసిన అనంతరం నాగాయపల్లెకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ తలారి గురుప్రసాద్, ట్రాక్టర్ యజమాని తలారి బాలుడు, చెన్నంరాజుపల్లెకు చెందిన పాలంగిల్లి చిన్న పోలయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

లైట్లు ఆఫ్ చేసి ట్రాక్టర్ నడపడం వల్లనే ప్రమాదం

కొందరు వ్యక్తులు కుందూ నది నుంచి నల్లమట్టిని రాత్రి వేళల్లో అమృతానగర్‌కు అక్రమంగా రవాణా చేసేవారు. రాత్రి గస్తీలో ఉన్న పోలీసులు గుర్తిస్తారని భావించి ట్రాక్టర్ ఇంజిన్ లైట్లు ఆఫ్ చేసుకొని రవాణా చేస్తున్నారు. ఈ నెల 23న తెల్లవారు జామున 3 గంటల సమయంలో తలారి గురుప్రసాద్ మట్టి ట్రాక్టర్‌తో లైట్లు ఆఫ్ చేసుకొని వస్తూ.. ఇసుకలో పడుకొని ఉన్న రాముపై ట్రాక్టర్ ఇంజిన్ ఎక్కించాడు. ఈ సంఘటనలో రాము అక్కడికక్కడే మృతి చెందాడు. లైట్లు ఆఫ్ చేసుకొని ట్రాక్టర్ నడిపి రాము మృతికి కారణం అయినందున డ్రైవర్‌తోపాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపించనున్నట్లు చెప్పారు. ఈ కేసులో నిందితులను గుర్తించేందుకు కృషి చేసిన కానిస్టేబుళ్లు బాబాఫకృద్దీన్‌తోపాటు నాగన్న, రాజశేఖర్‌లను జిల్లా ఎస్పీ అన్బురాజన్, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్‌లు అభినందించారు.

గ్రామాల్లో వీరబ్రహ్మేంద్రస్వామి రథయాత్ర


రథంలో ఆశీనులైన గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి

బ్రహ్మంగారిమఠం : మండలంలోని 56 గ్రామాల్లో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి రథయాత్ర నిర్వహిస్తున్నారు. సామాజిక సమరతలో భాగంగా తోట్లపల్లి అచలానందస్వామి ఆశ్రమం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపడుతున్నారు. ప్రత్యేకంగా తయారు చేయించిన రథంలో గోవిందమాంబ సమేతంగా వీరబ్రహ్మేంద్రస్వామి పర్యటిస్తున్నారు. ప్రతి గ్రామంలో సనాతనంగా వస్తున్న దేవాలయాల అభివృద్ధి, పౌరోహిత, పూజారుల వ్యవస్థ కులమతాలకు అతీతంగా బ్రహ్మంగారి బాటనే అలవర్చుకోవాలని చెప్పడమే ఈ పర్యటన ఉద్దేశమని అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వామి తెలిపారు. భగవంతునిపై భక్తితో ప్రతి గ్రామంలో అందరూ ప్రత్యేక హారతులు, పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే లింగాలదిన్నెపల్లె, మల్లేపల్లి, మల్లేపల్లి ఎస్సీ కాలనీ, చెంచయ్యగారిపల్లి, కేశాపురం, వెంకటాపురం, చిన్నాయపల్లి, శాంతినగరం, ముడుమాల గ్రామాలలో నిర్వహించినట్లు చెప్పారు. మిగిలిన గ్రామాల్లో కూడా పూర్తి చేయడం జరుగుతుందని వివరించారు. భక్తులు, ప్రజలు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఇటీవల చెంచయ్యగారిపల్లెలో అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వామి, ఈశ్వరీదేవిమఠం మఠాధిపతి వీరశివకుమారస్వామి, ఎంపీపీ వీరనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రథయాత్రలో పాల్గొన్న మఠాధిపతులు, ఎంపీపీ, భక్తులు

ఫకీర్లను బహిష్కరించే అధికారం లేదు

ఆస్థానయే గౌసియా పీఠాధిపతి


సమావేశంలో మాట్లాడుతున్న పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరా ఖాద్రీ

జమ్మలమడుగు : ఫకీర్లను బహిష్కరించే అధికారం ఎవరికీ లేదని ఆస్థానయే గౌసియా పీఠాధిపతి, ప్రభుత్వ గెజిటెడ్ ఖాజీ సయ్యద్‌షా గౌస్‌పీరా ఖాద్రీ పేర్కొన్నారు. సోమవారం ఆస్థానయే గౌసియాలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో కొంత మంది మత పెద్దలమని చెప్పుకుంటూ.. ఫకీర్లను సమాజం నుంచి వెలివేశామని ప్రచారం చేస్తున్నారని, ఇది తగదని అన్నారు. ఫకీర్లకు ఎవరూ దాన ధర్మాలు చేయకూడదని ప్రచారం చేయడం దారుణమన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింల మధ్య గొడవలు సృష్టించే విధంగా ప్రవర్తించడం సరికాదన్నారు. ఇది పట్టణంలోని ముస్లిం మత పెద్దలందరూ కలిసి తీసుకున్న నిర్ణయం అంటూ ప్రచారం చేయడాన్ని ఖండించారు. పట్టణంలో ఆ మతపెద్దలు ఎవరూ తమని సంప్రదించలేదని, తాము ఎవరినీ బహిష్కరించలేదన్నారు. కేవలం నిరుపేదలైన ఫకీర్ల కడుపు కొట్టే ప్రయత్నం చేయడంతోపాటు వారిని ఇళ్ల వద్దకు వస్తే తరిమి కొట్టాలంటూ విద్వేషాన్ని రెచ్చగొడుతున్నారన్నారు. ఇస్లాం అంటే అందరినీ దగ్గరకు తీసుకునేదే తప్ప బహిష్కరించేది కాదన్నారు. ఈ విషయంపై తాము పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి కుమారుడు సయ్యద్‌షా తాహిర్‌పీరాఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో జిల్లా ఫస్ట్


మునిచేతన్‌కుమార్ యాదవ్

తొండూరు : తొండూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి చదువుతున్న రాచకుంట మునిచేతన్‌కుమార్ యాదవ్ జాతీయ ఉపకార వేతనాల పరీక్షలో బీసీ విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించాడు. ఆ విద్యార్థి 103 మార్కులు సాధించాడని పాఠశాల హెచ్ఎం ఉమాదేవి తెలిపారు. అలాగే ఇనగలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన యాదవకుంట శివభవ్య జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం గంగా భవాని తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


వ్యవసాయ అధికారులతో చర్చిస్తున్న ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కడప అగ్రికల్చర్ : ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ఉద్యాన శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడప వ్యవసాయ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి సుభాషిణి ఆధ్వర్యంలో వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దెబ్బతిన్న పంటలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో రెండేళ్ల జైలు


షేక్ గాస్‌పీర్ (ఫైల్)

కడప అర్బన్/చెన్నూరు : చోరీ కేసులో షేక్ గాస్‌పీర్ (23)కు రెండేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్పెషల్ జె.ఎఫ్.సి.ఎం కోర్టు న్యాయమూర్తి హేమ స్రవంతి జానకీరామ్ సోమవారం తీర్పు చెప్పారు. చెన్నూరుకు చెందిన షేక్ గాస్ పీర్ 2021 మే 5న తెల్లవారుజామున చెన్నూరులోని వీరబ్రహ్మేంద్ర ఐస్‌ఫ్యాక్టరీలో రూ.44,450 దొంగతనం చేసినట్లు ఫ్యాక్టరీ యజమాని ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు చెన్నూరు ఎస్ఐ శ్రీనివాసుల రెడ్డి కేసు నమోదు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానా విధించారు. ఈ కేసును ప్రాసిక్యూషన్ తరఫున ఏ.పి.పి శ్రీకాంత్ వాదించారు. సాక్ష్యాధారాలతో నేరాన్ని నిరూపించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

- మృతులు అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు వాసులు
- వరుసకు అన్నదమ్ములు



షేక్ ఇబ్రహీం, మహమ్మద్ ముషబర్ బాషా (ఫైల్)

రేణిగుంట (తిరుపతి జిల్లా): రేణిగుంట-రైల్వేకోడూరు మార్గం రేణిగుంట మండలం కుక్కలదొడ్డి సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. రేణిగుంట ఎస్ఐ ఈశ్వరయ్య కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు ఎంజీ రోడ్డుకు చెందిన షేక్ ఇబ్రహీం(21), షేక్ మహమ్మద్ ముషబర్ బాషా(30) వరుసకు అన్నదమ్ములు. ఎంజీ రోడ్డులో ఇబ్రహీం చెప్పుల దుకాణం, మహమ్మద్ ముషబర్ బాషా దుస్తుల దుకాణం నడుపుతున్నారు. మహమ్మద్ ముషబర్ బాషాకు వివాహమై ఏడాదిన్నర వయస్సు కలిగిన కుమారుడు ఉన్నాడు. ఇబ్రహీంకు ఇంకా వివాహం కాలేదు. సోదరులైన వీరిద్దరు ఆదివారం చెన్నైలోని తమ బంధువుల వద్ద ఓ మోటార్‌బైక్, సెల్‌ఫోను కొనుగోలు చేసేందుకు స్కూటర్‌పై ఆదివారం ఉదయం చెన్నైకి బయల్దేరారు. చెన్నైకి చేరుకుని అక్కడ బేరం కుదరకపోవడంతో కేవలం సెల్‌ఫోను మాత్రమే తీసుకుని ఆదివారం రాత్రి స్వస్థలానికి తిరుగు పయనమయ్యారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో రేణిగుంట మండలం కుక్కలదొడ్డి సమీపంలోని దర్గా వంతెన వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న రేణిగుంట పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించారు. మృతుల బంధువులకు సమాచారం అందించడంతో వారు మార్చురీకి చేరుకుని బోరున విలపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వీరభద్రస్వామి హుండీ ఆదాయం లెక్కింపు


నగదు లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

రాయచోటి టౌన్ : రాయచోటిలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. ఆలయ, బ్యాంక్ అధికారులు, పాలక మండలి సభ్యులు విద్యార్థులతో కలిసి లెక్కింపు చేపట్టారు. హుండీల ద్వారా రూ.32,51,090 వచ్చింది. నిత్యాన్నదానం కోసం ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.54,155 సమకూరింది. స్వామి, అమ్మవారికి భక్తులు 73 గ్రాముల బంగారు, 2.420 కిలోల ఆభరణాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఈవో డీవీ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డి, పాలక మండలి సభ్యులు నాగభూషణ్, రత్నశేఖర్‌రెడ్డి, సురేష్‌కుమార్, పి.భాస్కర్, నరసింహులు, జిల్లా దేవదాయశాఖ పర్యవేక్షణ అధికారి జనార్ధన్, సాయి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లకీలో ఊరేగింపు

రాయచోటిలో భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామిని రాత్రి పల్లకీలో ఊరేగించారు. వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి రంగు రంగు పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించారు. స్థానిక భక్తులతోపాటు కన్నడిగులు పాల్గొన్నారు.

రెడ్డివారికుంట కబ్జా

కలెక్టర్‌కు రైతుల ఫిర్యాదు

ఓబులవారిపల్లె : మండలంలోని పెద్దఓరంపాడు రెవెన్యూ పరిధిలోని రెడ్డివారికుంటను దర్జాగా కబ్జా చేస్తున్నారు. దీనిని అరికట్టాలని పెద్దఓరంపాడు గ్రామ రైతులు సోమవారం రాయచోటిలో కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. కుంటలో కొంత మంది కట్టడాలు కట్టి, ప్లాట్‌లుగా చదును చేసి విక్రయించడానికి ప్రయత్నిస్తున్నారని వారు పేర్కొన్నారు. గ్రామంలోని పశువులు నీరు తాగడానికి, ఇతర అవసరాలకు కుంటలోని నీరు ఉపయోగ పడుతుందన్నారు. కావున ఆక్రమణలను తొలగించాలని కోరారు.


రెడ్డివారికుంటలో షెడ్ వేసిన దృశ్యం

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య


యేసోబు మృతదేహం

ఓబులవారిపల్లె : మండలంలోని మంగంపేట పునరావాస కాలనీ 9వ వీధికి చెందిన కె.యేసోబు(45) జీవితంపై విరక్తి చెంది సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. డ్రైవర్‌గా పని చేస్తున్న యేసోబు మద్యానికి బానిసయ్యాడు. వచ్చే నగదు కుటుంబ పోషణకు సరిపోకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల కారణంగా కలత చెందాడు. సోమవారం ఉదయం కొర్లకుంట రైల్వేట్రాక్ సమీపంలో ఎడమచేయి మణికట్టు కోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొన ఊపిరితో ఉన్న అతను తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని, కొర్లకుంట రైల్వేట్రాక్ సమీపంలో ఉన్నానని చివరిసారిగా మాట్లాడటం కోసం ఫోన్ చేశానని తెలిపాడు. వెంటనే కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా రక్తపు మడుగులో ఉన్న యేసోబును రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రామచంద్రయ్య తెలిపారు.

తల్లీపిల్లలు అదృశ్యం




జరీనా, సానియా, హాతీమ్ (ఫైల్)

కడప అర్బన్ : కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోచంపేటలో ప్రభుత్వ పాఠశాల వద్దకు ఈ నెల 20న చేరుకున్న సయ్యద్ జరీనా (27) తన ఇద్దరు పిల్లలు సయ్యద్ హాతీమ్ (12), సయ్యద్ సానియా(10)తోపాటు అదృశ్యమైందని ఆమె తల్లి ఖదీరున్నీసా సోమవారం ఫిర్యాదు చేసింది. కడప టూటౌన్ సీఐ సయ్యద్ హాసం ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చింతకొమ్మదిన్నె మండలం చెర్లోపల్లిలో సయ్యద్ జరీనా, సయ్యద్ అక్బర్ దంపతులు నివసిస్తున్నారు. సయ్యద్ అక్బర్ బేల్దారీ మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 20న తన భర్త బంధువులు మృతి చెందారని, అక్కడికి వెళ్లాలని తన సోదరుడు అన్వర్‌కు ఫోన్ చేసి తన ఇంటికి పిలిపించుకుంది. కడప నగరంలోని మోచంపేటకు చేరుకుంది. అక్కడ తన పిల్లలు చదువుతున్న పాఠశాలకు వెళ్లి, వారిని తన వెంటే తీసుకుని వెళ్లింది. తరువాత ఆమె ఆచూకీ తెలియరాలేదు. ఈ మేరకు ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సమస్యల పరిష్కారానికి సాంకేతికత వినియోగం

- వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య
- రెండు రోజుల జాతీయ సెమినార్ ప్రారంభం


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య

వైవీయూ : దైనందిత సమస్యల పరిష్కారానికి సాంకేతికత వినియోగం ముఖ్యమైనదని వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. సోమవారం వైవీయూ కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ రెడ్డయ్య అధ్యక్షతన 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ మిషన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ అప్లికేషన్స్' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సెమినార్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ నిత్య జీవితంలో ఆర్టిఫిషిల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ వంటి అనేక అప్లికేషన్లు భాగమయ్యాయని తెలిపారు. బ్యాంకుల్లో ఈ-అకౌంట్లు, సెల్‌ఫోన్లు ఇలా పలు అంశాల్లో సెక్యూరిటీ కోసం ఈ-అప్లికేషన్‌లను వాడుకుంటున్నామని పేర్కొన్నారు.

ఇలాంటి సెమినార్‌లు కొత్త జ్ఞానాన్ని అందిస్తాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ డేటాల్లో పట్టుసాధించడం ద్వారా ప్రపంచంలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. బస్సులు వెళ్లలేని చోటికి సాంకేతిక పరికరాలు పంపి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సమాచారాన్ని సేకరిస్తారన్నారు. రీసోర్స్ పర్సన్, ప్రొద్దుటూరు వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.నాగరాజు, వరంగల్ ఎన్ఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ యు.ఎస్.ఎన్. రాజు మాట్లాడుతూ మానవుల ప్రవర్తనను అనుకరించే యంత్రాలు, మెషిన్‌లెర్నింగ్ అనేది ఆర్టిఫిషిల్ ఇంటెలిజెన్స్ ఉపసమితి, ఇది యంత్రాలకు డేటాను అందించడం ద్వారా నిర్ణయాలు తీసుకునేలా చేయడంపై దృష్టి పెడుతుందన్నారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ రెడ్డయ్య సెమినార్ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో సదస్సు కో కన్వీనర్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు బి.సుశీల్‌కుమార్, ఎస్.శివజ్యోతి, సి.శ్వేత, జి.అమృతవాణి, బి.కరుణసాగర్, డాక్టర్ కె.హనుమంతునాయక్, కృష్ణయ్య, సి.వి.నారాయణరెడ్డి, రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.